

తీన్మార్ మల్లన్న-ఎమ్మెల్సీ, తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షులు


తెలంగాణ
# జీవగడ్డ
ఎడిటర్:
మోటపలుకుల వెంకట్
డిజిటల్ పత్రిక








ఎడిటర్ : మోటపలుకుల వెంకట్ , మంగళవారం 10-03-2026 సంపుటి :02 సంచిక : 156 పేజీలు :04 వెల : 3.00


## రైతు బంధు బంద్

### కొత్తగా రాహుల్ బంధు పథకం: కేటీఆర్



సిరిసిల్ల, మార్చి 09:
రాష్ట్రంలో రైతు బంధు పథకాన్ని బంద్ చేసి.. కొత్తగా రాహుల్ బంధు పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ తీసుకు వచ్చారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వ్యంగ్యంగా అన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీకి ఏడాదికి రూ. వెయ్యి కోట్లు పంపడమే రాహుల్ బంధు పథకమని ఆయన అభివర్ణించారు. సంవత్సరానికి రూ.1000 కోట్లు కప్పం కట్టి తన పదవిని సీఎం రేవంత్ రెడ్డి కాపాడుకొంటున్నారని ఆరోపించారు. సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో కేటీఆర్ పర్యటించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిన బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను ఆయన ఘనంగా సన్మానించారు.


2 లో


# నాణ్యతలేని మందులపై తెలంగాణ ప్రభుత్వం కఠిన చర్యలు



**హైదరాబాద్, మార్చి 9 :**
నాణ్యతలేని మందుల విక్రయాన్ని అరికట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. రాష్ట్ర డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) ఆధ్వర్యంలో బల్క్ ఎస్ఎంఎస్ అలర్ట్ సిస్టమ్‌ను ప్రారంభించారు. ఈ వ్యవస్థ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మెడికల్ షాపులకు వెంటనే సమాచారం అందించేలా చర్యలు తీసుకున్నారు.

**మెడికల్ షాపులకు తక్షణ సమాచారం..**
రాష్ట్రంలో ఎక్కడైనా నాణ్యతలేని, అనుమానాస్పద మందులు గుర్తించిన వెంటనే అన్ని మెడికల్ షాపులకు ఎస్ఎంఎస్ ద్వారా అలర్ట్ పంపిస్తున్నారు. దీంతో ఆ మందుల విక్రయాన్ని వెంటనే నిలిపివేయాలని మెడికల్ షాపులకు సూచనలు అందుతాయి

**ప్రజల ఆరోగ్య రక్షణే లక్ష్యం..**
ప్రజలకు హానికరంగా మారే మందులు మార్కెట్‌లో అమ్మకుండా ముందుగానే అడ్డుకోవడమే ఈ వ్యవస్థ ప్రధాన లక్ష్యం. నాణ్యతలేని మందులు అమ్మడం వల్ల రోగుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉండటంతో ప్రభుత్వం ఈ చర్యలను చేపట్టింది.

**రాష్ట్రవ్యాప్తంగా అనుసంధానం**
ఈ కొత్త వ్యవస్థకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మెడికల్ షాపులను ప్రభుత్వం అనుసంధానం చేస్తోంది. ఒకసారి అలర్ట్ జారీ అయిన వెంటనే ప్రతి ఫార్మసీకి సమాచారం చేరేలా డిజిటల్ సాంకేతికతను ఉపయోగిస్తున్నారు.

**డిజిటల్ పర్యవేక్షణకు ప్రాధాన్యం**
ఔషధాల నాణ్యత, పర్యవేక్షణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు డిజిటల్ టెక్నాలజీని వినియోగిస్తున్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ఆధునిక వ్యవస్థలను ప్రవేశపెట్టి మందుల నియంత్రణను మరింత కట్టుదిట్టం చేసేలా డీసీఏ అధికారులు చర్యలు చేపడుతున్నారు.

# పేదల ఇళ్లు కూల్చడం ప్రభుత్వ ఉద్దేశం కాదు

హైదరాబాద్ సిటీ, మార్చి 9 : "పేదల ఇళ్లు కూలగొట్టడం మా ప్రభుత్వ ఉద్దేశం కాదు. చెరువులు, నాలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. దాంతో, వర్షం వస్తే ఇళ్లలోకి నీళ్లు వస్తున్నాయి. నిత్యావసరాలు పాడై ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈ సమస్యలు తొలగించేందుకే చెరువులు, నాలాల పునరుద్ధరణ చేపడుతున్నాం. ఇందుకు సహకరించాలి. చెరువులు, నాలాలు ఆక్రమించుకున్న పెద్దలు, మిత్రులు, శ్రేయోభిషులు కూడా సహకరిస్తే బాగుంటుంది" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో రూ.20 కోట్లతో హైడ్రా అభివృద్ధి చేసిన నల్ల చెరువును సోమవారం ఆయన ప్రారంభించారు. చెరువు వద్ద గంగకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. పునరుద్ధరించిన చెరువుల వద్ద మహిళా స్వయంసహాయక సంఘాలకు స్టాల్స్ కేటాయిస్తున్నామని, వాకింగ్‌కు వచ్చేవారు నిత్యావసరాలు కొనుక్కెళ్లే అవకాశం ఉంటుందన్నారు.

మూసీని అభివృద్ధి చేసుకోవద్దా!?
"అహ్మదాబాద్‌లో సబర్మతి, ఢిల్లీలో యమున, ఉత్తరప్రదేశ్‌లో గంగ నదులను అభివృద్ధి చేసుకున్నారు. మూసీని మనం ఎందుకు అభివృద్ధి చేసుకోకూడదు!? మూసీ రివర్‌ఫ్రంట్ డెవల్‌పమెంట్ ఎందుకు చేసుకోకూడదో ప్రజలు ఆలోచించాలి. నదీ ప్రక్షాళనను అడ్డుకుంటే నగరానికి అన్యాయం చేసినట్టవుతుంది" అని సీఎం స్పష్టంచేశారు. దేశంలోని అన్ని ప్రధాన నగరాలు ఏదో ఓ సమస్యతో బాధపడుతున్నాయని, మన హైదరాబాద్ ఎంతో సురక్షిత నగరమని, దీన్ని మరింత పర్యావరణహితంగా మార్చేందుకు సహకరించాలని కోరారు. "ఢిల్లీలో కాలుష్యం తీవ్రంగా పెరిగి నివసించలేని దుస్థితి నెలకొంది. పాఠశాలలు, ప్రభు త్వ కార్యాలయాలు, చివరకు పార్లమెంట్‌కూ సెలవులిచ్చే పరిస్థితి వచ్చింది. ప్రధాని, రాష్ట్రపతి, కేంద్ర మంత్రులు, సుప్రీంకోర్టు వంటివి ఉన్న దేశ రాజధానిలో ముందుచూపు లేకపోవడం వల్లే ఈ దుస్థితి. ముంబైలో వాన పడితే ముంపు. బెంగళూరులో ట్రాఫిక్ సమస్య. చెన్నైలో అపార్ట్‌మెంట్లలోకి వరద నీరు వస్తోంది. కానీ, తెలంగాణలో కోర్ అర్బన్ రీజియన్ వరకు 3 కార్పొరేషన్లు ఏర్పాటు చేశాం. ఆ నగరాల్లా కాకుండా.. భవిష్యత్ తరాలకు ఇబ్బంది లేకుం డా కోర్ పరిధిలో చెరువులు, నాలాల పునరుద్ధరణ, పార్కులు, క్రీడా మైదానాల అభివృద్ధి, రోడ్ల నిర్మాణం తో హైదరాబాద్‌ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్దాం" అని సీఎం పిలుపునిచ్చారు. మూసీ అభివృద్ధి, రోడ్ల విస్తరణ, వంతెనల నిర్మాణ క్రమంలో ఆ స్తులు కోల్పోయే వారికి పరిహారం ఇస్తామని, ఇళ్లు కో ల్పోయే వారికి నివాసాలు కేటాయిస్తామని చెప్పారు.



# రైతు బంధు బంద్

సిరిసిల్ల, మార్చి 09: రాష్ట్రంలో రైతు బంధు పథకాన్ని బంద్ చేసి.. కొత్తగా రాహుల్ బంధు పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ తీసుకు వచ్చారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వ్యంగ్యంగా అన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీకి ఏడాదికి రూ. వెయ్యి కోట్లు పంపడమే రాహుల్ బంధు పథకమని ఆయన అభివర్ణించారు. సంవత్సరానికి రూ.1000 కోట్లు కప్పం కట్టి తన పదవిని సీఎం రేవంత్ రెడ్డి కాపాడుకొంటున్నారని ఆరోపించారు. సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో కేటీఆర్ పర్యటించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిన బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను ఆయన ఘనంగా సన్మానించారు.అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యం అంటే ఇళ్లు కూలగొట్టడమేనా అని ప్రశ్నించారు. మూడో పంటకు రైతు బంధు వేయాలన్నారు. కానీ నేటికి మూడో నెల వచ్చిన రైతు బంధు వేయడం లేదని రేవంత్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్థిక కష్టాలు ఉన్న మాట నిజమైతే రూ.లక్షన్నర కోట్లతో మూసి సుందరీకరణ ఎవరు చేయమన్నారంటూ రేవంత్ ప్రభుత్వాన్ని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. రైతు బంధు మీద దృష్టి పెట్టు.. అంతేకానీ రాహుల్ బంధు మీద కాదంటూ సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ చురకలంటించారు.ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో వికలాంగుల ఇళ్లను సైతం నిర్దాక్షిణ్యంగా కూల్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి సొంత ఇల్లు, ఆయన సోదరుడి ఇల్లు నిబంధనలకు



విరుద్ధంగా ఉన్నాయని.. వాటిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా కేటీఆర్ నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలుపై కేటీఆర్ వ్యంగ్య బాణాలు సంధించారు. వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి.. వెయ్యి రోజులు కావస్తున్నా అతీగతీ లేదని విమర్శించారు. ఆడబిడ్డల పెళ్లికి తులం బంగారం, రైతులకు పంట బోనస్, మహిళలకు నెలకు రూ. 2,500 ఇస్తామన్న హామీలు ఏమయ్యాయని ప్రభుత్వాన్ని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు.

# ఎల్‌పీజీ బుకింగ్ గడువు 25 రోజులకు పెంపు




న్యూఢిల్లీ: దేశీయ గ్యాస్ సిలిండర్ల బుకింగ్‌కు సంబంధించి నిబంధనల్లో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. ఒక సిలెండర్ డెలివరీ తర్వాత మరొక సిలిండర్ బుక్ చేయడడానికి కనీస గడువును 21 రోజుల నుంచి 25 రోజులకు కేంద్రం పెంచినట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. సిలిండర్లు నిల్వచేసుకోవడం, బ్లాక్ మార్కెటింగ్‌ను నిరోధించేందుకు కేంద్రం తాజా నిర్ణయం తీసుకున్నట్టు చెబుతున్నారు.ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం వలన కలిగే ఇంధన సరఫరా అంతరాయాలను అధిగమించేందుకు కేంద్రం తాజా చర్యలు చేపట్టింది. చమురు రిఫైనరీలకు ఎల్‌పీజీ ఉత్పత్తిని పెంచాలని, వాణిజ్య అవసరాల కంటే గృహ అవసరాలకే అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించింది.కాగా, ఇంతకుముందు 55 రోజులకు సిలిండర్లు బుకింగ్ చేసుకునే వారు ఇప్పుడు 15 రోజుల్లోనే సిలెండర్లు బుక్ చేసుకుంటున్న సందర్భాలు చోటుచేసుకుంటున్నాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. కేంద్రం సైతం ఎల్జీపీ భాగస్వాముల కోసం ప్రయత్నాలు చేస్తోందని, అల్జీరియా, ఆస్ట్రేలియా, కెనడా, నార్వే దేశాలు ఇండియాకు ఎల్పీజీ అమ్మేందుకు సంప్రదింపులు సాగిసున్నాయని ఆ వర్గాలు చెప్పాయి.క్రూడాయిల్ బ్యారెల్ ధర 130 డాలర్లు దాటనంత వరకూ పెట్రోల్, డీజిల్ ధరలు పెరగకపోవచ్చని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. భారత్ వద్ద తగినన్ని ఇంధన నిల్వలు ఉన్నాయని పేర్కొన్నాయి. క్రూడ్ ఆయిల్ బ్యారల్ ధర 100 డాలర్లు దాటకపోవచ్చని అంచనా వేస్తున్నామని, దేశంలోని ఏ ఒక్క పెట్రోల్ బంక్‌లోనూ పెట్రోల్, డీజిల్ కొరత ఉండదని ఆ వర్గాలు చెప్పాయి. ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయెల్ నిల్వలు కూడా తగినంత ఉన్నాయని, ఏటీఎఫ్ ఉత్పత్తి, ఎగుమతిదారుగా ఇండియా ఉన్నందున ఏటీఎఫ్ గురించి ఆందోళన అవసరం లేదని కూడా తెలిపాయి.

# మదనపల్లిలో ఫైళ్ల దహనం కేసులో నిందితులకు సుప్రీంకోర్టు షాక్

న్యూఢిల్లీ, మార్చి 09: మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల దహనం కేసులో వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరులకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పీఏతోపాటు ఆయన ప్రధాన అనుచరుడికి ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. వీరిద్దరికి బెయిల్ ఇచ్చే పిటిషన్‌పై సోమవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ కేసు దర్యాప్తునకు తాము అడ్డు రాలేమంటూ జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ మన్మోహన్‌తో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. 20 వేల ఎకరాలకుపైగా భూములకు సంబంధించిన దస్త్రాల దహనం చిన్న విషయమేమీ కాదని ఈ సందర్భంగా ధర్మాసనం అభిప్రాయపడింది. దీంతో వీరికి బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది.-అలాగే ఈ ఘటన చోటు చేసుకున్న సమయంలో తాను దేశంలో లేనంటూ కోర్టు దృష్టికి ఒక నిందితుడు తీసుకెళ్లాడు. కుట్ర పన్నడానికి దేశంలోనే ఉండాల్సిన అవసరం లేదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అదే విధంగా ఈ కేసులో ఇప్పటికే చాలా మంది నిందితులు బెయిల్‌పై బయటికి వచ్చారన్న నిందితుల వాదనను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. కింది కోర్టుకు వెళ్లి.. రెగ్యులర్ బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేసుకోవాలని నిందితులకు ధర్మాసనం సూచించింది.ఇంత పెద్ద వ్యవహారంలో ముందస్తు బెయిల్ ఇవ్వడం కుదరదని ధర్మాసనం తేల్చి చెప్పింది. ఆ క్రమంలో వీరు దాఖలు చేసిన రెండు పిటిషన్లను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. తమకు ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ ఈ కేసులో ఎ3, ఎ4 నిందితులుగా ఉన్న వంకిరెడ్డి మాధవరెడ్డి. బి మునిరత్నం సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం విదితమే. వీరిద్దరిలో ఒకరు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి మాజీ పీఏ కాగా.. మరొకరు ప్రధాన అనుచరుడిగా ఉన్నారు.

# ఇది మహిళా పోరాట దినం!

మార్చి 8 అనగానే దాని పోరాట స్ఫూర్తిని మహిళలకు అందించడం కాకుండా దానిని కొంతమంది కేవలం శుభాకాంక్షల రోజుగా దిగజార్చారు. ఈ నేపథ్యంలో గ్రామీణ భారతదేశంలో మహిళల జీవనాధారంగా నిలిచిన 'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం' భవిష్యత్తుపై నెలకొన్న అనిశ్చితి ఆందోళన కలిగిస్తోంది.గ్రామీణ భారతదేశంలో పేదలు, దళితులు, మహిళలు జీవనోపాధి కోసం ఎక్కువగా ఆధారపడే పథకం ఇది. సంవత్సరానికి కనీసం వంద రోజుల పనిని హామీ ఇస్తూ, పల్లెల్లోనే ఉపాధి కల్పించడం ద్వారా ఈ పథకం లక్షలాది కుటుంబాలకు ఆర్థిక భరోసా ఇచ్చింది. ముఖ్యంగా మహిళల భాగస్వామ్యం ఈ పథకంలో గణనీయంగా పెరిగింది. పల్లెల్లో మహిళలు స్వయంగా పనికి వెళ్లి సంపాదించడం వల్ల వారి కుటుంబాల్లో నిర్ణయాధికారం పెరిగింది. అప్పుల బానిసత్వం కొంతవరకు తగ్గింది. వలసల ఒత్తిడి కూడా తగ్గింది. ఇలాంటి పరిస్థితుల్లో ఎంఎన్ఆర్ఈజీఏను బలహీనపరచడం, దానికి బదులుగా వీబీ జీ రామ్ జీ పథకాన్ని తీసుకురావడం వంటివి గ్రామీణ సమాజంలో అనిశ్చితి కలిగిస్తున్నాయి.నిజానికి వ్యవసాయరంగంలోని మహిళల స్థితిగతులు పరిశీలించి, అసమానతలను తొలగించడానికి ప్రపంచ ప్రజల్లో అవగాహన పెంపొందించే లక్ష్యంతో ఐక్యరాజ్యసమితి 2026ను అంతర్జాతీయ మహిళా రైతు సంవత్సరంగా ప్రకటించింది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ముఖ్యంగా మూడో ప్రపంచ దేశాల్లో ఆహార ఉత్పత్తుల్లో పాల్గొంటున్న వారిలో 60 నుంచి 80శాతం వరకూ మహిళలే ప్రధాన భాగస్వామిగా ఉంటున్నారు. అయితే భూ యాజమాన్యంలో స్త్రీ పురుషుల మధ్య తీవ్ర అంతరాలు కొనసాగుతున్నాయి. ఆర్థిక కార్యకలాపాలలో పాల్గొంటున్న మహిళలు 80శాతం మంది వ్యవసాయ రంగంలోనే కొనసాగుతున్నారు. ప్రభుత్వాలు ఎన్ని హామీలు ఇచ్చినా ఎన్ని చట్టాలు చేసినా భూ కమతాలపై యాజమాన్యం, అధికారం పురుషులదే అవుతోంది. చట్టాలు కూడా వారికే అనుకూలంగా ఉన్నాయి. సొంత భూ కమతాలు ఉన్నవారు మహిళల్లో 8 నుంచి 14శాతం మాత్రమే ఉన్నారు. వ్యవసాయ రంగంలో పురుషుల కంటే ఎక్కువగా శ్రమిస్తున్న మహిళా రైతులు, రైతు కూలీలకు నేటికీ న్యాయం జరగట్లేదు. మహిళలు పోరాడి సాధించుకున్న హక్కులు రక్షించుకోవడానికి పోరాటాలే స్ఫూర్తిగా తీసుకోవాలనేది ఈ మార్చి 8 పిలుపులో మరో ముఖ్యమైన అంశం.మహిళల హక్కుల చరిత్రను చూస్తే ఒక స్పష్టమైన నిజం మనకు కళ్ళకు కనబడుతుంది. ఏ హక్కూ స్వయంగా దానధర్మంగా రాలేదు. ప్రతి హక్కూ పోరాటాల ద్వారానే సాధ్యమైంది. సమాజంలో సమానత్వం కోసం మహిళలు సాగించిన ఉద్యమాలు అనేక చట్టాలకు పునాది అయ్యాయి. వరకట్న నిరోధం నుంచి గృహహింస నిరోధం వరకు, పని స్థలాల్లో లైంగిక వేధింపుల నివారణ నుంచి క్రిమినల్ చట్టాల్లో మార్పుల వరకు ప్రతి చట్టం వెనుక మహిళల నిరంతర పోరాటాల చరిత్ర ఉంది. అయినా, మహిళల సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. ఇన్ని చట్టాలు ఉన్నా మహిళలు ఎందుకు ఇంకా రోడ్డెక్కి పోరాడాల్సి వస్తోంది? అంటే, ప్రభుత్వాలు చట్టాలు చేయడం ఒక్కటే సరిపోదు. అవి సక్రమంగా అమలయ్యేవిధంగా చూడాలి. ఈ బాధ్యత ప్రభుత్వానిదే.చట్టాలు వచ్చినప్పటికీ మహిళల జీవన స్థితిగతులు పూర్తిగా మారలేదు. గ్రామీణ ప్రాంతాల్లో, పేద వర్గాల్లో మహిళలకు న్యాయం జరగడం ఇంకా కష్టసాధ్యంగా ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో మహిళల ఉద్యమాలు మరింత తీవ్రతరం కావాల్సిన అవసరం పెరుగుతోంది. మహిళల సమాన హక్కుల కోసం సాగుతున్న ప్రతి ఉద్యమమూ మన సమాజానికి ఒక చైతన్యాన్ని అందిస్తుంది. న్యాయం కోసం, హక్కుల కోసం మన మహిళల పోరాటం ఇంకా ముగియలేదు. అది నిరంతరం కొనసాగాలి.





# పాంచ్ పటాకా




సొంత గడ్డపై జరిగిన టీ20 ప్రపంచకప్‌లో భారత జట్టు రికార్డులను తిరగరాస్తూ మూడోసారి విజేతగా నిలిచింది. కానీ ఆరంభం నుంచి ఫైనల్ వరకు మనోళ్ల ప్రదర్శన ఆహా.. అనే రీతిలో లేకపోయినా తుది పోరుకు చేరడం, ఆపై విజేతగా నిలిచే ప్రయాణంలో కొందరు కీలక పాత్ర పోషించారు. జట్టు క్లిష్ట పరిస్థితిలో ఉన్నప్పుడు తమ అనుభవాన్ని జోడించి విజయాలబాట పట్టించిన ఆ ఐదుగురు క్రికెటర్ల ఆటతీరును ఓసారి పరిశీలిద్దాం..టీ20 వరల్డ్‌కప్ ఆరంభానికి ముందు సంజూ శాంసన్ పేలవ ఫామ్‌తో ఉన్నాడు. తుది జట్టులో అతడికి అవకాశం దక్కుతుందని ఎవరూ భావించలేదు. కానీ భారత్ తరఫున అత్యధికంగా 321 పరుగులు సాధించడమే కాదు.. ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్‌గానూ నిలిచాడు. జట్టు కచ్చితంగా గెలవాల్సిన నాకౌట్ మ్యాచ్‌ల్లో 97 (నాటౌట్), 89, 89 స్కోర్లతో అదరగొట్టి విజేతగా నిలిపాడు. వీటన్నింటినీ శతకాలుగా మలిచే చాన్సున్నా, సొంత మైలురాళ్ల కోసం అతను ఎదురుచూడలేదు. తొలి ఐదు మ్యాచ్‌ల్లో భారత్ ఓపెనింగ్ సగటు 6.80 మాత్రమే. కానీ శాంసన్ వచ్చాక మిగిలిన నాలుగింట్లో ఆ సగటు 48.75కు వెళ్లడం విశేషం.

బుమ్రా

టోర్నీలో స్టార్ పేసర్ బుమ్రా మాత్రం జట్టుకు కొండంత అండగా నిలిచాడు. మిగతా బౌలర్లు ధారాళంగా పరుగులిస్తున్నా తను మాత్రం యార్కర్లతో ప్రత్యర్థి బ్యాటర్ల జోరుకు బ్రేకులు వేశాడు. సెమీస్‌లో ఇంగ్లండ్ హవాను అడ్డుకుంది బుమ్రానే. ఫైనల్లోనూ కెరీర్ బెస్ట్ (4/15)షో తో ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు. మొత్తంగా 168 బంతుల్లో కేవలం 174 పరుగులివ్వడమే కాకుండా 14 వికెట్లు తీసి తానెంత ప్రమాదకరమో చాటిచెప్పాడు.

అక్షర్ పటేల్

సూపర్-8 ముగిసే వరకు భారత ఫీల్డింగ్ నాసిరకంగా ఉంది. ఏకంగా 13 క్యాచ్‌లను వదిలేసి మిగతా జట్లతో పోలిస్తే అట్టడుగున నిలిచింది. కానీ సెమీఫీసలో ఇంగ్లండ్‌పై స్పిన్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ పట్టిన కళ్లుచెదిరే క్యాచ్‌లు మాత్రం జట్టుకు జీవం పోశాయి. కెప్టెన్ హ్యారీ బ్రూక్ క్యాచ్‌ను అందుకునే క్రమంలో 20 మీటర్లు వెనక్కి వెళ్లి నభూతో.. అనే తరహాలో డైవింగ్ క్యాచ్ తీసుకున్నాడు. ఇక బెథెల్‌తో పరుగుల మోత మోగిస్తున్న జాక్స్ క్యాచ్‌ను అయితే నమ్మశక్యం కాని రీతిలో ఆపాడు. తాను బౌండరీ లైన్‌పై పడిపోతున్న క్రమంలో బంతిని పక్కనే ఉన్న దూబే వైపు విసరడంతో మ్యాచ్ మనవైపు తిరిగింది.

శివమ్ దూబే

వాస్తవానికి రావాల్సినంత గుర్తింపు రాకపోయినా.. జట్టు భారీ స్కోర్లు సాధించడంలో శివమ్ దూబే ఫినిషింగ్ కీలక పాత్ర పోషించాడు. సెమీఫీసలో 25 బంతుల్లో 43, ఫైనల్లో 8 బంతుల్లో 26 పరుగులతో అదరగొట్టాడు. బౌలింగ్ పరంగా ఇబ్బందిపడినా.. 235 పరుగులతో తన బ్యాటింగ్ స్ట్రయిక్ రేట్ 211.42గా ఉండడం విశేషం.

సూర్యకుమార్

బ్యాటింగ్‌లో ప్రముఖ పాత్ర పోషించకపోయినా జట్టును విజయపథంలో నడిపించాడు. విఫలమవుతున్న అభిషేక్, వరుణ్ చక్రవర్తిలకు అండగా నిలిచాడు. దీంతో ఫైనల్లో అభిషేక్ చెలరేగగా..వరుణ్ అత్యధిక వికెట్లు (14) తీసి బుమ్రాతో కలిసి టాప్‌లో నిలిచాడు. ఓపెనర్‌గా శాంసన్‌ను ఆడించి సక్సెస్ అయ్యాడు.








# సారా అర్జున్..

## అలా ఎప్పుడూ చేయదు!

బేబీ సారా ... పలు తమిళ, హిందీ, తెలుగు సినిమాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది. యుక్త వయసు లోనూ కొన్ని చిత్రాల్లో నటించిన సారా గత యేడాది డిసెంబర్ 5న విడుదలైన 'ధురంధర్' మూవీలో రణవీర్ సింగ్ సరసన నటించి, మంచి మార్కులు కొట్టేసింది. అలానే తెలుగులో గుణశేఖర్ రూపొందించిన 'యుఫోరియా' చిత్రంలోనూ ఓ కీలకపాత్రను పోషించి, నటిగా తన సత్తాను మరోసారి చాటుకుంది.ఇదిలా ఉంటే... ఇప్పుడు అందరి దృష్టి మార్చి 19న రాబోతున్న 'ధురంధర్ 2' సినిమా మీద ఉంది. అదే రోజు విడుదల కావాల్సిన యశ్ 'టాక్సిక్' (ɹశీ×ఱప) వాయిదా పడటంతో జాతీయ స్థాయిలో 'ధరంధర్ 2'కు మరింత క్రేజ్ పెరిగింది. తెలుగులో ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవడానికి పవన్ కళ్యాణ్ 'ఉస్తాద్ భగత్ సింగ్' రెడీ అవుతోంది. ఆ సినిమాను మార్చి 19న విడుదల చేయబోతున్నారు.మూవీ ట్రైలర్‌లు
గత కొద్ది రోజులుగా సారా అర్జున్ సోషల్ మీడియాలో తనకు సంబంధంలేని విషయంలో ట్రోలింగ్‌కు గురవుతోంది. ఆ విషయమై ఆమె తండ్రి అర్జున్ వివరణ ఇచ్చారు. 'టాక్సిక్' సినిమా వాయిదా పడిన నేపథ్యంలో 'చీశ్ శీ×ఱషఉఎ, శీఅశ్రీఎ ణఙ్ట్రబత్ఝుఅస్ట్రుఝతీ' అంటూ ఎక్స్‌లో సారా అర్జున్ ఓ పోస్ట్ పెట్టినట్టు ప్రచారం జరిగింది. దాంతో తన సినిమాను ప్రమోట్ చేసుకోవడానికి వేరే చిత్రాన్ని సారా తక్కువ చేసిందంటూ కొందరు విమర్శించారు. ఇది చినికి చినికి గాలివానగా మారకముందే... ఈ విషయమై సారా తండ్రి క్లారిఫికేషన్ ఇస్తూ, 'నిజానికి సారా అర్జున్ ఎక్స్ (ట్విట్టర్)లో లేదని, అది ఫేక్ అక్కౌంట్ అని తెలిపారు. సారా కేవలం ఇన్ స్టాగామ్‌లోనే ఉందని చెబుతూ, 'తన సినిమా గురించి గొప్పగా చెప్పడానికి వేరొకరి సినిమాను తగ్గించే ఆలోచన సారా ఎప్పుడూ చేయదు. మేమంతా సినిమా రంగంలో ఉన్నవాళ్ళమే. దీన్ని ఓ పెద్ద కుటుంబంగా మేం భావిస్తాం. సారాకు ప్రతి నటుడి పట్ల, ప్రతి సినిమా పట్ల గౌరవం ఉంటుంది. తన ప్రాజెక్ట్‌ను ప్రమోట్ చేయడానికి ఇతర వాటిని కించపరిచే ఆలోచన సారాకు ఉండదు. కాబట్టి ఇలాంటి అబద్ధపు సమాచారాన్ని నమ్మవద్దని, ప్రచారం చేయవద్దని ఆమె తండ్రిగా అందరికీ కోరుతున్నాను' అని అర్జున్ చెప్పారు. అలానే కాస్టింగ్ డైరెక్టర్ ముఖేశ్ చబ్రా, సారా అర్జున్ కొత్త ప్రాజెక్ట్ పై వివరణ ఇచ్చారు. కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో ఆమె ఇంతియాజ్ అలీ నెక్ట్స్ ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు వస్తున్న వార్తలను ఖండించారు. సారా అర్జున్ ఎవరి సినిమాకూ సైన్ చేయలేదని, 'ధురంధర్ 2' విడుదల తర్వాతే ఏ సినిమా చేయాలనే విషయంలో ఓ నిర్ణయం తీసుకుంటుందని అన్నారు. తానే ఆమె కొత్త సినిమాకు సంబంధించిన సమాచారాన్ని ఇస్తానని, ఈలోగా ఎలాంటి వార్త వచ్చినా... అది ఫేక్ న్యూసే అని ఆయన చెప్పారు.

